


TGTEL/25/A31


# నేటి దిక్సూచి

తెలుగు దిన పత్రిక




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :169 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ గురువారం- 16- జూలై- 2026

## మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల విస్తరణ - రూ.1,638.52 కోట్లతో భూసేకరణకు అనుమతి



- మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల రెండో దశ విస్తరణకు అనుమతి
- రూ.1,638.52 కోట్లతో 6,248.54 ఎకరాల భూసేకరణ
- ఓడరేవుల విస్తరణలో రెండవ దశకు
- ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్న జనార్ధన్ రెడ్డి

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల (రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం) రెండో దశ విస్తరణకు గాను రూ.1,638.52 కోట్లతో 6,248.54 ఎకరాల భూసేకరణకు పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. రాష్ట్రంలో సముద్ర రవాణా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి ఈ ప్రాజెక్టులను వేగవంతం చేస్తోంది. రాష్ట్ర తీరప్రాంత అభివృద్ధిలో భాగంగా మిగతా..2లో

## ఢిల్లీకి బయల్దేరిన కేటీఆర్.. కుమారస్వామితో కీలక భేటీ



- ఆదిలాబాద్ జిల్లాలోని సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కుమారస్వామిని కోరనున్న కేటీఆర్
- భేటీ అనంతరం మీడియాతో మాట్లాడనున్న కేటీఆర్
- కేటీఆర్‌తో పాటు ఢిల్లీకి వెళ్లిన వద్దిరాజు
- రవిచంద్ర, జోగు రామన్న తదితరులు

హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని బృందం ఢిల్లీకి బయలుదేరింది. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని ఈ బృందం కలిసి ఆదిలాబాద్ జిల్లాలోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కోరనుంది. మిగతా..2లో

## 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ

## టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



- మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేస్తామన్న మహేశ్ గౌడ్
- పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్ తో చర్చించామని వెల్లడి
- మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టీకరణ

హైదరాబాద్: రాష్ట్రంలో 50 నామినేటెడ్ పదవులను ఈ నెలలోనే భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ప్రస్తుతం మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు.

## ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి

# అమెజాన్ డేటా సెంటర్ మైలురాయి

- ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు రేవంత్ శంకుస్థాపన
- 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం
- ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్-500 కంపెనీలకు ఆహ్వానం
- మెట్రో విస్తరణ, ఈవీ బస్సులు, మూసీ ప్రక్షాళనకు ప్రాధాన్యం
- భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందించాలని ఆదేశం



హైదరాబాద్: ఫ్యూచర్ సిటీని ప్రపంచంలోనే అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీనివల్ల మరిన్ని పెట్టుబడులు, అంతర్జాతీయ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్-500 కంపెనీలను ఆహ్వానిస్తున్నామని రేవంత్ తెలిపారు. గతేడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు 108 దేశాల నుంచి పరిశ్రమలు పాల్గొన్నాయని గుర్తు చేశారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమన్నారు. మిగతా..2లో

## బలమైన భవిష్యత్తుకు

# బాల్యమే పునాది

- ఉత్తమ సేవల అంగన్‌వాడీ సిబ్బందికి ఆగస్టు 15న సన్మానం
- వచ్చే నెల నుంచి అంగన్‌వాడీల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం
- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క



హైదరాబాద్, జూలై 15 : చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై మంత్రి సీతక్క సచివాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది అన్నారు. 'మీ పిల్లలు, మనవరాళ్ల వయస్సు ఉన్న చిన్నారులే అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు.. వారిని సొంత పిల్లలుగా భావించి సేవ చేయాలి.. పిల్లలు అంగన్‌వాడీకి రావడం ఒక మెట్టు.. వారు హుషారుగా, ఆరోగ్యంగా ఎదగడం మరో ఎత్తు. వారి మేధాశక్తిని పెంచేలా మన సేవలు ఉండాలి' మిగతా..2లో

## భారత్ సెమికాన్ 2.0కు గ్రీన్ సిగ్నల్.. యువతకు

## భారీ ఉద్యోగాలపై మోదీ సర్కార్ ఫోకస్



- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో దేశ పారిశ్రామిక, సాంకేతిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది.

ఢిల్లీ : ముఖ్యంగా రూ.1.27 లక్షల కోట్ల విలువైన 'సెమికాన్ 2.0' పథకం, కొత్త యూరియా ప్లాంట్ల కోసం పెట్టుబడి విధానం, మొబైల్ తయారీ రంగానికి 2.0 పథకం, సెమికండక్టర్ తయారీని ప్రోత్సహించే చర్యలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. భారత్‌ను ప్రపంచ స్థాయి సెమికండక్టర్,

## తెలంగాణలో పోక్సో చట్టం సమర్థవంతంగా

# అమలు చేయండి

### సీఎం రేవంత్‌కి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ విజ్ఞప్తి

**తెలంగాణలో పోక్సో చట్టం సమర్థవంతంగా అమలు చేయడానికి తక్షణం చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరారు. ఈ మేరకు బుధవారం జనసేన పార్టీ తరఫున తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు.**




అమరావతి, జులై 15: తెలంగాణలో పోక్సో చట్టం సమర్థవంతంగా అమలు చేయడానికి తక్షణం చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరారు. ఈ మేరకు బుధవారం జనసేన పార్టీ తరపున తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. పోక్సో కేసుల దర్యాప్తు, బాధితుల రక్షణకు సంబంధించిన పలు అంశాలపై ఆ లేఖలో ఏపీ డిప్యూటీ సీఎం ప్రత్యేక సూచనలు చేశారు. అలాగే ఈ కేసుల దర్యాప్తు 60 నుంచి 90 రోజుల్లో పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు పూర్తి రక్షణ కల్పించే వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆ లేఖలో ఏపీ డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ కేసుల్లో బెయిల్‌ను గట్టిగా వ్యతిరేకించాలని

## సెమీకాన్ 2.0కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

# మొబైల్ తయారీకి భారీ ప్రోత్సాహం

- రూ.1.27 లక్షల కోట్లతో సెమీకాన్ 2.0కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- వారణాసిలో రెండు మెగా ఎలివేటెడ్ కారిడార్లకు గ్రీన్ సిగ్నల్
- యూరియా ఉత్పత్తిలో స్వయం సమృద్ధి లక్ష్యంగా జాతీయ పెట్టుబడి విధానం


### రూ.10వేల కోట్లతో 31 కారిడార్




ఢిల్లీ : దేశంలో తయారీ, మౌలిక వసతులు, వ్యవసాయం, రైల్వే రంగాలకు ఊతమిచ్చేలా కేంద్ర క్యాబినెట్ బుధవారం ఏడు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. మొత్తం రూ.2,19,353 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపనున్నాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా సెమీకండక్టర్ తయారీ, రవాణా మౌలిక వసతులు, యూరియా ఉత్పత్తి, మొబైల్ తయారీ రంగాల్లో దీర్ఘకాలిక ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకుంది. బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. దేశ అభివృద్ధికి అవసరమైన కీలక రంగాల్లో పెట్టుబడులను పెంచడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ నిర్ణయాల ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. మిగతా..2లో

## మహిళలకు ధైర్యం కోసమే

# అభయ కార్యక్రమం



- చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని వివరించారు.
- పిల్లలను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని పేర్కొన్నారు.

అనకాపల్లి, జులై 15: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు చాలా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ఓ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బుధవారం అనకాపల్లి జిల్లాలోని వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని

## అది రాష్ట్ర ద్రోహం,

# దేశ ద్రోహంతో సమానం

- మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ. 35 వేల కోట్ల బడ్జెట్‌తో పనులు చేపడతామని వెల్లడి
- రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం
- గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని విమర్శలు
- కేఎల్ రావు జయంతి, పట్టిసీమ జలహారతి కార్యక్రమంలో కీలక హామీలు




అమరావతి : ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన 'జలహారతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..

## చంద్రబాబు సానుభూతిపరులు సిండికేట్‌గా

## ఏర్పడి రైతులను దోచుకుంటున్నారు



- భీమవరంలో ఆక్వా రైతులతో జగన్ ముఖాముఖి
- ఫీడ్, సీడ్ రేట్లను చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని విమర్శ
- చంద్రబాబు ప్రతి అడుగు మోసమేనని మండిపాటు

అమరావతి : రాష్ట్రంలో ఆక్వా రంగం సమస్యల సుడిగుండంలో ఉందని, ఆక్వా రైతులు దీనావస్థలో ఉన్నారని మిగతా..2లో

# మొదటిపేజి తరువాయి

## చంద్రబాబు సానుభూతిపరులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారు

వైసీపీ అధినేత జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరంలో ఆక్వా రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన జగన్... ఇష్టానుసారం ఫీడ్ ధరలు పెంచుకుంటూ పోతున్నారని ఆరోపించారు. ధరల పెరుగుదలకు హేతుబద్ధత ఉండాలని, ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. దున్నపోతు మీద వాన పడినట్టు ప్రభుత్వం తీరు ఉందని విమర్శించారు. ఆక్వా రంగం ఐదు లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని జగన్ తెలిపారు. చంద్రబాబు సానుభూతిపరులే సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫీడ్, సీడ్ రేట్లు చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని, చంద్రబాబు సిండికేట్ రాష్ట్రాన్ని నడిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఫీడ్ రేట్లు కేజీకి రూ.14 నుంచి 16కి ఎడాపెడా పెంచేశారని, ముష్టి వేసినట్టు కేజీకి రూ.2 తగ్గిస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. రేట్లు పెంచితే పెంచేస్తారని... రేట్లు తగ్గితే తగ్గించరా అని మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఆక్వా రైతుల కోసం 'అప్సడా' ఏర్పాటు చేశామని... సీడ్, ఫీడ్, మార్కెటింగ్‌లో సమస్యలు వస్తే పరిష్కరించామని గుర్తు చేశారు. చంద్రబాబు వచ్చాక 'అప్సడా'ను నిర్వీర్యం చేశారని విమర్శించారు. రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్నామని, రొయ్యలకు మద్దతు ధర తగ్గకుండా మానిటర్ చేశామని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధర తగ్గకూడదని చట్టం చేశామన్నారు. ఈరోజు కేజీ కౌంట్ రూ.230లు దాటని పరిస్థితి ఉందని చెప్పారు. ఆక్వా రైతులకు తాము 1.50కే యూనిట్ విద్యుత్ అందించామని, ఐదేళ్లలో సబ్సిడీ కింద రూ.3,306 కోట్లు చెల్లించామని గుర్తు చేశారు. చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.401 కోట్ల సబ్సిడీ బకాయిలు చెల్లించామన్నారు. చంద్రబాబు ప్రతి అడుగు మోసమని విమర్శించారు. ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చారా? అని ప్రశ్నించారు.

## ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి అమెజాన్ డేటా సెంటర్ మైలురాయి

2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దతామని పేర్కొన్నారు. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో తెలంగాణ వాటా 10 శాతం ఉండేలా కృషి చేస్తామని అన్నారు. ఈ లక్ష్యాల సాధనకు భారీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు అవసరమని, అందుకే 'తెలంగాణ రైజింగ్' విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం మంత్రులు, అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు నగరంలోని పరిశ్రమలను దశలవారీగా తరలిస్తామని, మెట్రో విస్తరణ చేపడతామని సీఎం వెల్లడించారు. డీజిల్ తో నడిచే ఆర్టీసీ బస్సులను నగరం వెలుపలికి తరలించి, వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి జీరో ట్యాక్స్ విధించే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి కాలుష్య రహితంగా మారుస్తామని, మెట్రో విస్తరణ, మూసీ పునరుద్ధరణ, పరిశ్రమల తరలింపుతో కూడిన ప్రాంతాన్ని 'కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)'గా అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ ప్రాంతాన్ని భవిష్యత్తులో సేవల రంగానికి అనుగుణంగా పునర్నిర్మిస్తామని చెప్పారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు 10 కిలోమీటర్ల పరిధిని తయారీ పరిశ్రమల (మ్యాన్యుఫ్యాక్చరింగ్) జోన్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములు ఇచ్చిన రైతుల సేవలను ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని రేవంత్ అన్నారు. వారికి ఎలాంటి నష్టం జరగకుండా తగిన పరిహారం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

## 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

రెండు రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అవుతామన్నారు. మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో కూడా మాట్లాడానని మహేశ్ తెలిపారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టుగా రేణుక తనతో చెప్పారని అన్నారు. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు అని తెలిపారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికీ గాంధీభవన్ కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు.

## తెలంగాణలో పోక్సో చట్టం సమర్థవంతంగా అమలు చేయండి

బాధితులను బెదిరించే నిందితులపై కఠిన నిఘా అవసరమని అభిప్రాయపడ్డారు. బాధితులకు వైద్య పరీక్షలు 24 గంటల్లో పూర్తి చేయాలని ప్రతిపాదించారు. ఫోరెన్సిక్, డీఎన్ఏ ఆధారాలను త్వరితగతిన సేకరించాలని సూచించారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక పోక్సో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని పవన్ కల్యాణ్ కోరారు. పోక్సో కేసులపై జిల్లా, రాష్ట్ర స్థాయిలో నెల వారీ సమీక్షలు నిర్వహించాలని అన్నారు. ఈ కేసుల్లో ఆలస్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, హాస్టళ్లు, ప్రార్థనా స్థలాల్లో తప్పనిసరి రిపోర్టింగ్ విధానం ఉండాలని ఈ లేఖలో తెలంగాణ సీఎం రేవంత్‌ను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరారు.

## భారత్ సెమికాన్ 2.0కు గ్రీన్ సిగ్నల్.. యువతకు భారీ ఉద్యోగాలపై మోదీ సర్కార్ ఫోకస్

మొబైల్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. కేబినెట్ సమావేశంలో వారణాసిలో గంగా-వరుణ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు పలు కీలక ప్రాజెక్టులకు కూడా గ్రీన్ సిగ్నల్ లభించింది. వీటిలో అత్యంత ప్రాధాన్యం పొందింది సెమికాన్ 2.0 పథకమే. ఈ పథకంపై సుమారు రూ.1.27 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నారు. దీని ద్వారా భారత్‌ను ప్రపంచంలోనే ప్రముఖ సెమికండక్టర్ డిజైన్, తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, టెలికాం, రక్షణ, ఏరోస్పేస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి కీలక రంగాలకు మరింత బలం చేకూరనుంది. సెమికండక్టర్ రంగంలో కొత్త తరం చిప్ డిజైన్ టెక్నాలజీ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది. ప్రస్తుతం దేశంలో 105 స్టార్టప్‌లు, మీడియం సంస్థలు చిప్ డిజైన్ రంగంలో పనిచేస్తుండగా, కొత్త పథకం ద్వారా వీటికి ఆధునిక డిజైన్ టూల్స్, సాంకేతిక సహాయం, పరిశోధనకు మద్దతు అందించనున్నారు. అంతేకాకుండా దేశీయ, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలతో కలిసి మరింత ఆధునిక చిప్ టెక్నాలజీల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నారు. వ్యవసాయ రంగాన్ని దృష్టిలో ఉంచుకుని 2031 నాటికి కొత్త యూరియా ప్లాంట్ల స్థాపనకు ప్రోత్సాహం అందించే కొత్త పెట్టుబడి విధానాన్ని కూడా కేబినెట్ ఆమోదించింది. యూరియా సబ్సిడీ పథకాన్ని కొనసాగించడంతో పాటు, ఇప్పటికే ఉన్న యూరియా ప్లాంట్లకు కొత్త ఇంధన సామర్థ్య ప్రమాణాలను అమలు చేయనున్నారు. నాఫ్తా ఆధారిత యూరియా ప్లాంట్లను గ్యాస్ ఆధారిత వ్యవస్థలకు మార్చే నిర్ణయం కూడా తీసుకున్నారు. దీంతో తక్కువ వ్యయంతో, అధిక సామర్థ్యంతో యూరియా ఉత్పత్తి సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మొబైల్ ఫోన్ తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పీఎల్ఐ 2.0 పథకానికి కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా ప్రపంచ స్థాయి మొబైల్ తయారీ కేంద్రంగా భారత్‌ను మరింత బలపరచడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, కొత్త పరిశ్రమలు నెలకొల్పడం, ఉపాధి అవకాశాలను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. సెమికండక్టర్ తయారీకి అవసరమైన సిలికాన్ ఫ్యాబ్‌లు, కాంపౌండ్ సెమికండక్టర్ ఫ్యాబ్‌లు, డిస్‌ప్లే ఫ్యాబ్‌లు, ఏటీఎంపీ, ఓఎస్ఏటీ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇవ్వనున్నారు. అలాగే చిప్ తయారీలో ఉపయోగించే యంత్రాలు, రసాయనాలు, గ్యాస్‌లు, ఇతర కీలక ముడిసరుకుల దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకోనున్నారు. ప్రభుత్వం అంచనా ప్రకారం దేశంలోని మొదటి సెమికండక్టర్ ఫ్యాబ్ 2028 నాటికి ఉత్పత్తి ప్రారంభించే అవకాశం ఉంది. ఈ రంగానికి అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇప్పటివరకు 315 విశ్వవిద్యాలయాల్లో సుమారు 68 వేల మంది విద్యార్థులకు చిప్ డిజైన్ శిక్షణ అందించారు. ఇకపై ఫ్యాబ్‌లు, క్లీన్‌రూమ్‌లు, చిప్ తయారీకి సంబంధించిన ఇతర విభాగాల్లో కూడా శిక్షణను విస్తరించనున్నారు. దీంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, సెమికాన్ 1.0 కింద ఇప్పటివరకు 12 తయారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించగా, వాటిలో రూ.1.64 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి.

## ఢిల్లీకి బయల్దేరిన కేటీఆర్.. కుమారస్వామితో కీలక భేటీ

ఈ మేరకు కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేయనున్నారు. బృందంలో కేటీఆర్‌తో పాటు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి జోగు రామన్న, ఖానాపూర్ ఇంచార్జి జాన్సన్ నాయక్, సీసీఐ సాధన సమితి నాయకులు ఉన్నారు. కుమారస్వామితో భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడనున్నారు. తెలంగాణలో పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలని బీఆర్ఎస్ నేతలు కోరుతున్నారు. ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని బీఆర్ఎస్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. కేటీఆర్ ఢిల్లీ పర్యటన రాష్ట్ర అభివృద్ధి, పరిశ్రమల పునరుద్ధరణకు కీలకమవుతుందని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు.

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం

మొదటిపేజి తరువాయి

గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు.

**విమర్శలనే కాదు.. వారి మోసాన్ని మ్యూజియంలో పెడతా**

గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. "వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలాడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును 'పట్టిసీమ', 'దండగ' అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. "నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు**

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. "రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు వంశధార-నాగావళి-గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

**మహనీయుల స్ఫూర్తితో ముందుకు**

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని, చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్ రావు కుమారుడు విజయరావు కోరిన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని కూడా తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

# మహిళలకు ధైర్యం కోసమే అభయ కార్యక్రమం

మొదటిపేజి తరువాయి

భారతి కన్వెన్షన్‌లో అభయ కార్యక్రమాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా అభయ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళల భద్రత - మా బాధ్యత అంటూ అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఎన్నో పోరాటాలు వలన మహిళలకు స్వేచ్ఛ వచ్చిందని గుర్తు చేశారు. మహిళలకు ధైర్యం కల్పించడానికి.. అభయ కార్యక్రమాన్ని పోలీసులు ప్రారంభించారని తెలిపారు. చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. పిల్లలను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని అన్నారు. కష్టపడి చదువుకొని, ఉన్నత స్థాయికి వెళ్ళాలని ఈ సందర్భంగా పిల్లలకు ఆమె సూచించారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పడితే తక్షణమే 112కి కాల్ చేయాలని అన్నారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని వివరించారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకండి అంటూ పిల్లలకు హోం మంత్రి అనిత హితవు పలికారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వారికి స్పష్టం చేశారు. ఒకటే జీవితం.. దానిని ఆనందంగా మార్చుకోవాలని పిల్లలకు ఏపీ హోం మంత్రి సూచించారు. పిల్లల ప్రవర్తనపై నిత్యం దృష్టి పెట్టాలని తల్లిదండ్రులకు వివరించారు. మీ జీవితాల్లో చదువు మాత్రమే మార్పు తీసుకొస్తుందని అన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో కూడా అభయ ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అనకాపల్లి జిల్లాలో పెద్ద సంఖ్యలో డ్రోన్లు వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని.. ముందుకు సాగాలని విద్యార్థులకు హోం మంత్రి అనిత సూచించారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: హోం మంత్రి

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. నక్కపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిలో కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. పాయకరావుపేటతో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల నుంచి ప్రజలు తరలివచ్చారు. మిగిలిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ గ్రీవెన్స్‌లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల విస్తరణ - రూ.1,638.52 కోట్లతో భూసేకరణకు అనుమతి

మొదటిపేజి తరువాయి

మూడు గ్రీన్‌ఫీల్డ్ ఓడరేవుల విస్తరణలో రెండో దశకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం నాడు వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, శాఖాధిపతులతో నెలవారీ ప్రణాళికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి జనార్దన్ రెడ్డి ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, భూసేకరణ కోసమే తాము పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. 6,248 ఎకరాల భూమిని సేకరించేందుకు రూ.1,638.52 కోట్ల మొత్తాన్ని మంజూరు చేసినట్లు వివరించారు. రామాయపట్నం ఓడరేవు రెండవ దశ కోసం 2,924.45 ఎకరాల భూసేకరణకు రూ.851 కోట్లు కేటాయించారు. మూలపేట ఓడరేవు విస్తరణలో భాగంగా 1,903.29 ఎకరాల భూసేకరణకు రూ.440.52 కోట్లు మంజూరు చేశారు. అలాగే మూలపేటలో ఉప్పు మడుల భూముల సేకరణతో సహా పునరావాస, సహాయక చర్యలను చేపడుతున్నారు. మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ ఓడరేవు రెండవ దశ అభివృద్ధిలో భాగంగా 1,470.70 ఎకరాల భూసేకరణ కోసం సుమారు రూ.347 కోట్లు విడుదల చేస్తున్నారు. భవిష్యత్తు ప్రణాళికలు: రామాయపట్నం, మూలపేట పోర్టుల నుంచి ఈ ఏడాది వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. వీటితో పాటు పీపీపీ విధానంలో కాకినాడ గేట్‌వే పోర్టు నిర్మాణాన్ని కూడా వేగవంతం చేశారు. ఈ కొత్త పోర్టుల నిర్మాణం పూర్తయితే ఏటా అదనంగా 109 మిలియన్ టన్నుల సరకు రవాణా సామర్థ్యం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో సముద్ర రవాణా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే పోర్టుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. తూర్పు తీరంలోనే ఏపీని అత్యుత్తమ లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణను ముమ్మరం చేసింది. ఈ ఏడాది చివరి నాటికే రామాయపట్నం, మూలపేట పోర్టుల నుంచి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే ఏడాది నాటికి మచిలీపట్నం పోర్టును వినియోగంలోకి తీసుకురానుంది. కాకినాడ గేట్‌వే పోర్టును 2028 నాటికి అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. నాలుగు పోర్టుల్లో పనులు ఎంతవరకు పూర్తయ్యాయంటే?: రాష్ట్రంలో నాలుగు కొత్త పోర్టుల పనులు వేగంగా సాగుతున్నాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టు పనులు 78.28 శాతం పూర్తి కాగా, దీని వ్యయం రూ.4,929.40 కోట్లు. శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు పనులు రూ.4,361.90 కోట్లతో 75.5 శాతం పూర్తయ్యాయి. కృష్ణా జిల్లా మచిలీపట్నం పోర్టు పనులు రూ.5,155.80 కోట్లతో 57.91 శాతానికి చేరగా, కాకినాడ గేట్‌వే పోర్టు పనులు రూ.2,620 కోట్లతో 41 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

# సెమీకాన్ 2.0కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం- మొబైల్ తయారీకి భారీ ప్రోత్సాహం- రూ.10వేల కోట్లతో 31 కారిడార్

మొదటిపేజి తరువాయి

## సెమీకాన్ 2.0కు భారీ కేటాయింపు

క్యాబినెట్ ఆమోదించిన నిర్ణయాల్లో అత్యంత ప్రాధాన్యం పొందింది సెమీకాన్ 2.0 ప్రోగ్రామ్. ఇందుకోసం రూ.1,27,500 కోట్ల నిధులను కేటాయించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్లు లేదా చిప్‌లకు భారీ డిమాండ్ ఉంది. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆటోమొబైల్ పరిశ్రమ, రక్షణ రంగం వంటి అనేక విభాగాలు చిప్‌లపైనే ఆధారపడి ఉన్నాయి. ఇప్పటివరకు భారత్ చిప్‌ల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ఇప్పటికే సెమీకండక్టర్ మిషన్ ప్రారంభించింది. ఇప్పుడు రెండో విడతగా తీసుకొచ్చిన సెమీకాన్ 2.0 ద్వారా చిప్ డిజైన్, తయారీ, పరిశోధన, ప్యాకేజింగ్, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం అమలుతో దేశంలో దాదాపు రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. అంతేకాకుండా భారత్‌ను ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు.

## వారణాసికి భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు

క్యాబినెట్ తీసుకున్న తొలి రెండు నిర్ణయాలు వారణాసి నగరానికి సంబంధించినవే. వేగంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. మొదటి ప్రాజెక్టుగా వరుణా నది వెంట 6/4 లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. దీనికి రూ.10,998 కోట్ల వ్యయం అవుతుంది. వారణాసి రింగ్ రోడ్‌ను జాతీయ రహదారి-31తో అనుసంధానం చేసే ఈ ప్రాజెక్టు మొత్తం 43.21 కిలోమీటర్ల మేర నిర్మించబడుతుంది. రెండో ప్రాజెక్టుగా గంగా నది వెంట 6 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.14,448 కోట్లుగా అంచనా వేశారు. ఈ రెండు కారిడార్లు పూర్తయితే వారణాసిలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడమే కాకుండా పర్యాటక, వాణిజ్య కార్యకలాపాలకు కూడా ఊతమివ్వనున్నాయి.

## యూరియాలో స్వయం సమృద్ధి లక్ష్యం

వ్యవసాయ రంగానికి సంబంధించి కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశాన్ని యూరియా ఉత్పత్తిలో స్వయం సమృద్ధిగా మార్చేందుకు "నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ ఫర్ యూరియా-2026"కు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం దేశంలో ఎరువుల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో యూరియా దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం అవసరమని కేంద్రం భావిస్తోంది. ఈ విధానం ద్వారా కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, రైతులకు ఎరువుల సరఫరాను మరింత స్థిరంగా ఉంచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిర్ణయానికి ప్రత్యేక ఆర్థిక కేటాయింపు లేకపోయినా, భవిష్యత్ పెట్టుబడులకు మార్గం సుగమం చేయనుంది.

## రైల్వే రంగానికి మరో రెండు ప్రాజెక్టులు

దేశంలో సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్రం రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఒడిశాలోని పరదీప్- హరిదాస్‌పూర్ రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు రూ.2,542 కోట్ల వ్యయాన్ని ఆమోదించింది. దీంతో పోర్టు ప్రాంతాల నుంచి సరుకు రవాణా మరింత సులభతరం కానుంది. అలాగే దంగోపోసి-రాజ్‌ఖర్సవాన్ మధ్య నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి రూ.1,365 కోట్ల పెట్టుబడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే తూర్పు భారతదేశంలో రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగనుంది.

## మొబైల్ తయారీకి రూ.62,500 కోట్ల ప్రోత్సాహం

దేశీయ తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్రం మొబైల్ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ఎంపీఎంఎస్) లేదా పీఎల్ఐ 2.0 పథకానికి రూ.62,500 కోట్లతో ఆమోదం తెలిపింది. ఒకప్పుడు మొబైల్ ఫోన్ల కోసం దిగుమతులపైనే ఆధారపడిన భారత్, ప్రస్తుతం ప్రపంచంలోనే ప్రధాన స్మార్ట్‌ఫోన్ తయారీ కేంద్రాల్లో ఒకటిగా ఎదుగుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 300కు పైగా మొబైల్ తయారీ యూనిట్లు పనిచేస్తున్నాయి. 2024-25లో భారత్ నుంచి రూ.2.62 లక్షల కోట్ల విలువైన స్మార్ట్‌ఫోన్లు ఎగుమతి అయ్యాయి. వీటిలో యాపిల్ ఫోన్ల వాటా అధికంగా ఉంది. అలాగే దేశీయ మొబైల్ తయారీ విలువ 2019-20లో రూ.2.14 లక్షల కోట్లుగా ఉండగా, 2024-25 నాటికి రూ.5.5 లక్షల కోట్లకు పెరిగింది. కొత్త పీఎల్ఐ 2.0 పథకం ద్వారా మరిన్ని కంపెనీలు భారత్‌లో తయారీ యూనిట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఈ కథనాన్ని మరింత విశ్లేషణాత్మకంగా లేదా టీవీ బులెటిన్ శైలిలో కూడా మార్చవచ్చు.

# బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది

మొదటిపేజి తరువాయి

అని అధికారులకు సూచించారు. గతంలో ఉమ్మడి జిల్లాలు చాలా పెద్దగా ఉండేవని, ప్రస్తుతం చిన్న జిల్లాలు ఏర్పడినందున మారుమూల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా జిల్లా అధికారులు సందర్శించాలని మంత్రి ఆదేశించారు. డీడబ్ల్యూవోలు, సూపర్‌వైజర్లు భోజనం నాణ్యతను పరిశీలించేందుకు తరచూ అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేయాలని సూచించారు. గుడ్లు, పప్పు, పాలు, ఇతర పోషకాహార పదార్థాల ఇండెంట్, సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని మంత్రి సీతక్క హెచ్చరించారు. 'మీకు నాణ్యమైన సరకులు రాకపోతే మాకు రిపోర్టు చేయండి.. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందాలి.. గర్భిణులు, బాలింతల విషయంలోనూ ఎలాంటి రాజీ ఉండదు.. మంచి జరిగినా, లోపం ఉన్నా మీ అనుభవాలను మాకు తెలియజేయండి.. వాటి ఆధారంగా సేవలను మరింత మెరుగుపరుస్తాం' అని మంత్రి తెలిపారు. ఒకటి రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం కోడి గుడ్లు సరఫరా చేశారని పత్రికల్లో వచ్చిన కథనాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఆయా వార్తలపై జిల్లా అధికారులు వెంటనే సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం మంచి ఫలితాలు ఇస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల చిన్నారుల హాజరు పెరగడంతోపాటు వారి అభ్యాస సామర్థ్యం కూడా మెరుగుపడుతోందన్నారు. వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆ పథకం అమలుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**పిల్లల సంఖ్య పెరుగుదలపై నివేదికలు సిద్ధం చేయాలి**

'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య ఎంత మేర పెరిగిందో జిల్లాల వారీగా నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. పాలు అందించడం వంటి నూతన కార్యక్రమాల ఫలితాలను కూడా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన 2,500 నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరాన్నిబట్టి భవిష్యత్తులో మరో 2,500 నుంచి 3,000 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. మంజూరైన భవనాలను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా వర్చువల్ విధానంలో ఒకేసారి ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, పైప్‌లైన్ నీటి కనెక్షన్ వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని స్పష్టం చేశారు. వలస కార్మికుల పిల్లల కోసం కార్మిక శాఖ సహకారంతో మొబైల్ అంగన్‌వాడీలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లోనూ మొబైల్ అంగన్‌వాడీలను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మారుమూల గుత్తికోయ గూడేల్లోని చిన్నారులకు కూడా పోషకాహారం, ఫీడింగ్ సేవలు పూర్తిస్థాయిలో అందాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క చిన్నారి ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదన్నారు. సిబ్బంది ప్రవర్తన, క్రమశిక్షణ ఆదర్శంగా ఉండాలని, పిల్లలతో ఎలా మాట్లాడాలి, ఎలా మెలగాలి, వారి మానసిక వికాసానికి ఎలా తోడ్పడాలనే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు రోజు వారి జీవితానికి అవసరమైన వివిధ అంశాలను పరిచయం చేస్తూ వారి మేధాశక్తి, గ్రహణ శక్తి పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే 12 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ చేసి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని, ఒకటి రెండు రోజుల్లో మిగిలిన జిల్లాల్లోనూ నోటిఫికేషన్లు విడుదల చేయాలని సూచించారు. రాష్ట్రాన్ని బాల్య వివాహాల రహిత తెలంగాణగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మన పరిధిలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకూడదు.. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలవాలి అని స్పష్టం చేశారు. శిశు సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతోపాటు దత్తత ప్రక్రియను వేగవంతం చేసి ప్రత్యేక దత్తత సంస్థల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**బాగా పనిచేసే వారిని ఆగస్టు 15న సన్మానిద్దాం**

అంగన్‌వాడీ వ్యవస్థలో అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, టీచర్లు, ఆయాలను గుర్తించాలని మంత్రి సూచించారు. ఆగస్టు 15 నాటికి ఉత్తమ సేవలందిస్తున్న వారిని ఎంపిక చేసి సన్మానించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లా నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు టీచర్లతో త్వరలో సమావేశమై వారి సమస్యలను వింటామని తెలిపారు. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే సిబ్బంది అనుభవాలు, సూచనలను స్వీకరించి వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. వచ్చే నెల 16, 17 తేదీల్లో మళ్లీ సమీక్షిస్తా. ఈ నెల రోజుల కాలాన్ని సవాలుగా తీసుకుని పనిచేయండి

# సంపాదకీయం

## న్యాయ వ్యవస్థ స్వతంత్రత కోల్పోతున్నదా?

ఒక తండ్రి తన అయిదేళ్ల కుమారుడిని స్కూలుకు తీసుకువెళుతుండగా, ఒక ట్యాంకర్ వెనుకనుంచి వచ్చి ఢీకొనడంతో ఆ బాలుడు మరణించాడు. ఆ రోడ్డుకు ఫుట్‌పాత్ కానీ, రోడ్డు దాటేందుకు క్రాసింగ్ గుర్తులు కానీ లేవు. దేశంలో ఇలాంటి ఘటనలు పెద్ద సంఖ్యలో జరుగుతూనే ఉంటాయి కానీ ఉన్నత న్యాయస్థానం మాత్రం ఈ విషాద ఘటనపై అరుదైన రీతిలో స్పందించింది. నడిచి వెళ్లడం అనేది ఆర్టికల్ 19(1)(డి), ఆర్టికల్ 21 క్రింద ప్రాథమిక హక్కులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ ఆదేశాలు జారీ చేశారు. రహదారులను వాహనాల కోసమే కాకుండా పాదచారులకు అనువైన విధంగా నిర్మించాలని ఆయన చెప్పారు. భారతదేశంలో నడిచి వెళ్లడం అనేదానికి సాంస్కృతిక, మతపరమైన, రాజకీయ, సామాజిక విలువ ఉన్నదని కూడా ఆయన గుర్తు చేశారు. దండి యాత్ర, భూదానోద్యమం లాంటి చారిత్రక ఘటనలను జస్టిస్ నరసింహ ఉదహరించారు. నడిచి వెళ్లడమే ఒక ఘర్షణగా మారిన ఈ దేశంలో ఏటా సగటున 36,500 మంది పాదచారులు సరైన ఫుట్‌పాత్‌లు, క్రాసింగ్‌లు లేక మరణిస్తున్నారని ఒక అధ్యయనం వెల్లడించింది. 80శాతం పట్టణ రోడ్లలో సురక్షితమైన, నడిచివెళ్లే వారికి అనువైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల ఈ ఘటనలు జరుగుతున్నాయి. మెట్రో నగరాల్లో 44శాతం రోడ్లకు అసలు ఫుట్‌పాత్‌లే లేవు. ఉన్న ఫుట్‌పాత్‌లలో అత్యధికం ఇండియన్ రోడ్ కాంగ్రెస్ విధించిన నిబంధనలకు అనుగుణంగా లేవు. వికసిత్ భారత్, ట్రిలియన్ ఎకానమీ, విశ్వనగరాల గురించి మాట్లాడే ప్రభుత్వ పెద్దలకు దేశంలో నడిచివెళ్లే వారి దుస్థితి గురించి ఎంతవరకు తెలుసు? ప్రజల ప్రాథమిక హక్కులకు అనుగుణంగా చట్టాలు చేయకపోవడాన్ని ఈ సందర్భంగా జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. మోటారు వాహనాల చట్టం చేసినప్పుడు నడిచి వెళ్లే ప్రజల ప్రాథమిక హక్కును గుర్తించలేదని, ఈ చట్టం కేవలం వాహనాల కోసమే చేసినట్లున్నదని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ప్రధాన న్యాయమూర్తి కానున్న రెండో తెలుగువాడైన జస్టిస్ పీఎస్ నరసింహ నడకను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని తీర్పు ఇచ్చిన తర్వాత ప్రజల నుంచి విపరీతమైన ప్రతిస్పందన వచ్చింది. అనేక నగరాల్లో ఫుట్‌పాత్‌లు లేకపోవడం గురించి కథనాలు వస్తున్నాయి. రూల్ ఆఫ్ లా, స్వతంత్ర వైఖరి, ప్రమాణాల గురించి న్యాయవాదులు ముందుగా తెలుసుకోవాలని, విశ్వసనీయత పెంచుకోవాలని జస్టిస్ నరసింహ ఇచ్చిన మరో తీర్పుకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సానుకూలంగా స్పందించింది. జస్టిస్ నరసింహ సూచించినట్లుగా న్యాయవాదులకు జాతీయ లీగల్ అకాడమీని ఏర్పర్చేందుకు సిద్ధమయింది. 'గురుబ్రహ్మ, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః' అని శ్లోకాలు చదవడం ప్రధానం కాదు, ఆ గురువులకు సరైన జీతాలు ఇవ్వాలి.. అని గుజరాత్ విద్యాలయాల్లో అధ్యాపకులకు కనీస వేతన స్కేలును వర్తింపచేయాలని జస్టిస్ నరసింహ ఇచ్చిన తీర్పును కూడా అనేకమంది స్వాగతించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ పేరిట రాజస్థాన్ గుజరాత్ గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షులకు ముప్పు రాకుండా ఆయన అడ్డుకున్నారు. మండుటెండల్లో మంచి చినుకుల్లాగా అప్పుడప్పుడూ జస్టిస్ నరసింహ మాత్రమే కాదు, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ నాగరత్న, జస్టిస్ విశ్వనాథన్ తదితరులు ఇచ్చిన కొన్ని మంచి తీర్పులను విస్మరించలేం. వందమీటర్ల ఎత్తు దాటితే ఆరావళి పర్వతాలను కూల్చివేయవచ్చని ఇచ్చిన తీర్పును పర్యావరణవేత్తల ఆందోళనతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిలిపివేశారు. పలు చెప్పుకోదగ్గ తీర్పులు అడపాదడపా సుప్రీంకోర్టు నుంచి వస్తున్నప్పటికీ న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తోందా అన్న చర్చ మాత్రం ఆగడం లేదు. దేశంలో ఉన్నత న్యాయస్థానం పాత్ర రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతున్న విషయం చర్చనీయాంశమవుతోంది. సుప్రీంకోర్టు అస్తిత్వం కోల్పోతోందని, ఎవరి నియంత్రణలోనో ఉన్నట్లుగా వ్యవహరిస్తోందని, ప్రాథమిక హక్కులను విస్మరిస్తోందని మాజీ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విసిరిన ఘటనను దేశం మరిచిపోకముందే గతవారం ఒక పిటిషనర్ నిండు కోర్టులో సీజేఐపై అసభ్య వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ఘటనలు సర్వోన్నత న్యాయస్థానం పట్ల పెరుగుతున్న నిరాశా నిస్పృహలకు సంకేతాలుగా అభివర్ణించేవారున్నారు. మరో వైపు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీ ఎత్తున డబ్బు దొరికిన ఘటన రీత్యా ఆయనపై మహాభియోగం ప్రవేశపెట్టేందుకు పార్లమెంట్ సిద్ధమవుతోంది. న్యాయవ్యవస్థను ఆత్మరక్షణలో పడవేసేందుకు లభించే అవకాశాన్ని ప్రభుత్వం ఎందుకు వదులుకుంటుంది? రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవాలంటే న్యాయవ్యవస్థ స్వతంత్రత అవసరం అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్వయంగా స్టాక్ హోమ్‌లో జరిగిన ఒక సదస్సులో అభిప్రాయపడ్డారు. ప్రాథమిక హక్కులను కాపాడిన కేశవానంద భారతి, సమాఖ్య స్ఫూర్తిని పరిరక్షించిన ఎస్.ఆర్ బొమ్మై తదితర కేసులను ఆయన ఉటంకించారు. ఈ తీర్పులు చరిత్ర పుటల్లో కెక్కాయి. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు స్వేచ్ఛగా సజావుగా ఎలాంటి బయటి ఒత్తిడి లేకుండా వ్యవహరించేందుకు సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు జోక్యం చేసుకుంది. మరి గత కొన్నేళ్లుగా సుప్రీంకోర్టు నుంచి ఇలాంటి ఎన్ని అద్భుతమైన తీర్పులు వచ్చాయి? కొన్ని హైకోర్టుల నుంచి కూడా ఇటీవలి కాలంలో మంచి తీర్పులు వచ్చిన ఉదంతాలు లేకపోలేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తే నగర బహిష్కారం విధిస్తారా? అని బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవ్ జె జమ్దార్ ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వానికి బానిసలు కాదు,

# బ్రిటిష్ విపణిలో జెండా పాతాలంటే...



నేటి నుంచి అమలులోకి వస్తున్న భారత్-బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా) మన ఎగుమతిదారులకు కొత్త అవకాశాలను కల్పిస్తోంది. వివిధ రంగాల్లో వివిధ రకాలుగా ఉండే వీటిని అందిపుచ్చుకోవడానికి సమగ్ర వ్యూహం పాటించాలి. కార్మికులను పెద్ద సంఖ్యలో నియమించి తయారుచేసే వస్తువులు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, సముద్ర ఆహారం, ఆటోమొబైల్స్, కొన్ని పారిశ్రామిక ఉత్పత్తులను బ్రిటన్‌కు పెద్దఎత్తున ఎగుమతి చేయడానికి 'సెటా' వీలు కల్పిస్తుంది. నిరుడు బ్రిటన్ 92,890 కోట్ల డాలర్ల విలువైన వస్తువులను దిగుమతి చేసుకుంది. వాటిలో భారత్ నుంచి వెళ్లిన వస్తువుల విలువ కేవలం 1,520 కోట్ల డాలర్లే. ఈ వాటాను పెంచుకోవడానికి 'సెటా' సాయపడుతుంది. ఈ ఒప్పందం కింద బ్రిటన్‌లో బాగా గిరాకీ ఉన్న కొన్ని రంగాల్లో భారత ఎగుమతుల వృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయి. భారతదేశం 2025లో ప్రపంచ దేశాలకు 1,630 కోట్ల డాలర్ల విలువైన దుస్తులను ఎగుమతి చేసింది. అదే సంవత్సరం బ్రిటన్ మిగతా దేశాల నుంచి దిగుమతి చేసుకున్న దుస్తుల విలువ 2,130 కోట్ల డాలర్లు. వాటిలో భారతదేశం నుంచి వెళ్లిన వస్త్రాల విలువ 130 కోట్ల డాలర్లు మాత్రమే. 'సెటా' వల్ల భారతీయ దుస్తుల దిగుమతులపై సుంకాలు తగ్గుతాయి కాబట్టి, ఈ అవకాశాన్ని మన పరిశ్రమలు ఉపయోగించుకోవాలి. 'సెటా' కింద సుంకాలు తగ్గే తోలు వస్తువులు, పాదరక్షల ఎగుమతి వృద్ధికీ బాగా అవకాశాలున్నాయి.

### కొన్నింట్లో అధికం... మరికొన్నింట్లో మధ్యస్థం!

గడచిన సంవత్సరంలో బ్రిటన్ దిగుమతి చేసుకున్న ప్రాసెస్ చేసిన ఆహారం విలువ 3,340 కోట్ల డాలర్లు కాగా, అందులో భారత్ వాటా 35.4 కోట్ల డాలర్లే. బ్రిటన్‌కు రెడీ టూ ఈట్ ఆహారాలు, బేకరీ, మిఠాయి ఉత్పత్తులు, సాస్‌లు, భారతీయ వంటకాల ఎగుమతులను పెంచడానికి గొప్ప అవకాశాలున్నాయి. 2025లో భారత్ ప్రపంచదేశాలకు 2,560 కోట్ల డాలర్ల విలువైన ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలను ఎగుమతి చేసింది. సరిగ్గా ఇదే కాలంలో బ్రిటన్ 2,320 కోట్ల డాలర్ల విలువైన దిగుమతులు చేసుకుంది. అందులో భారత్ వాటా కేవలం 3.1 శాతం. 'సెటా' చలవతో దీన్ని బాగా పెంచవచ్చు. నిరుడు భారత్ అన్ని దేశాలకు ఎగుమతి చేసిన చేపలు, మాంసం, ప్రాసెస్డ్ మాంసాహారాల విలువ 1280 కోట్ల డాలర్లు. అదే సంవత్సరం బ్రిటన్ 1720 కోట్ల డాలర్ల విలువైన మాంసాహారాన్ని విదేశాల నుంచి తెప్పించుకుంది. ఆ దిగుమతుల్లో భారత్ నుంచి వచ్చినవాటి విలువ 12.6 కోట్ల డాలర్లు మాత్రమే. బ్రిటన్ ఆహార ప్రమాణాలను పాటించి మన ఎగుమతులను పెంచుకోవచ్చు. ఆటోమొబైల్స్, మోటార్‌సైకిళ్లు, వాటి విడిభాగాలనూ పెద్ద సంఖ్యలో బ్రిటన్‌కు పంపవచ్చు. బ్రిటన్ దిగుమతి చేసుకున్న ఈ తరహా వస్తువుల విలువ 9,220 కోట్ల డాలర్లు కాగా, వాటిలో భారత్ ఎగుమతుల విలువ 32.5 కోట్ల డాలర్లే. 'సెటా' కింద సుంకాల తగ్గింపుతో ఈ రంగంలోనూ భారతీయ ఎగుమతిదారులకు చక్కటి అవకాశాలు లభిస్తాయి. యంత్రాలు, టెలికాం, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతుల పెంపునకూ 'సెటా' ఊతమిస్తుంది. ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యమిస్తూ తిరుగులేని నాణ్యతా ప్రమాణాలను పాటిస్తేనే ఎగుమతుల్లో భారత్‌కు లబ్ధి కలుగుతుంది. రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్ రంగంలో భారత్‌కు బలమైన సరఫరా సామర్థ్యం ఉన్నప్పటికీ, 'సెటా' ద్వారా లభించే అవకాశాలు పరిమితం. బ్రిటన్ ప్లాస్టిక్, రబ్బరు ఉత్పత్తుల దిగుమతుల్లో భారత్ వాటా స్వల్పమే. సుంకాల తగ్గింపు కొన్ని వస్తువుల ఎగుమతికి తోడ్పడినా- పర్యావరణ నిబంధనలు, సాంకేతిక ప్రమాణాలు, బలమైన పోటీ వల్ల లాభాలు తక్కువగా ఉంటాయి. 2025లో బ్రిటన్ ప్రపంచ దేశాల నుంచి 17,850 కోట్ల విలువైన వజ్రాలు, బంగారం, వెండి ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. వీటిలో భారత్ నుంచి వంద కోట్ల డాలర్ల విలువైనవి మాత్రమే దిగుమతి అయ్యాయి. లండన్ అంతర్జాతీయ బులియన్ మార్కెట్ కాబట్టి, ఇక్కడ నెగ్గుకురావడం భారత్‌కు సులువు కాదు. కాగితం, కొయ్య ఉత్పత్తులు, రైల్వే-విమాన-నౌకా ఉత్పత్తులు, కృత్రిమ పూలు, గొడుగులు, వంట నూనెలు కూడా మధ్యస్థ అవకాశాల విభాగంలోకి వస్తాయి. రవాణా ఖర్చులు, పర్యావరణ నిబంధనలు, తీవ్రమైన పోటీ, విదేశాలకు పంపేందుకు భారత్‌కు మిగులు పరిమితంగా ఉండటం తదితరాల వల్ల ఈ వస్తు ఎగుమతుల్లో లాభాలు తక్కువగా ఉంటాయి.

### మెరుగ్గా సిద్ధం కావాలి!

ఇనుము, ఉక్కు ఉత్పత్తులకు సంబంధించి బ్రిటన్ విధించే కఠిన నిబంధనలు, తగ్గిన కోటాలు, అధిక సుంకాలు 'సెటా'కు అడ్డురావచ్చు. మద్యం, పొగాకు ఉత్పత్తుల ఎగుమతులకూ అవకాశాలు తక్కువే. మద్యం విషయంలో బలమైన పోటీ, సిగరెట్లు వంటి వాటిలో అధిక ఎక్సైజ్ పన్నులు, కఠినమైన ఆరోగ్య నిబంధనలు ఇందుకు కారణాలు. భారత్‌కు కొన్ని వస్తువులలో బలమైన ఎగుమతి సామర్థ్యం ఉంటే-బ్రిటన్‌లో వాటికి గణనీయమైన గిరాకీ నెలకొంది. 'సెటా'తో సుంకాల ప్రతికూలతలు తప్పిపోతాయి కాబట్టి దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దుస్తులు, తోలు, పాదరక్షలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, సముద్ర ఆహారం, ఎంపిక చేసిన వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో ఇది స్పష్టంగా లాభిస్తుంది. ఆటోమొబైల్స్ దీర్ఘకాలికంగా మంచి అవకాశాన్ని అందిస్తాయి. యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాబ్రికేటెడ్ మెటల్ ఉత్పత్తులు కూడా బలంగా వృద్ధి చెందగలవు. కానీ, ఈ రంగాల్లో విజయం సుంకాల తగ్గింపు కంటే నాణ్యతా ప్రమాణాల పైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల భారత్‌కు రంగాల వారీగా ఎగుమతి వ్యూహం అవసరం. ఆహార ఎగుమతిదారులు బ్రిటిష్ శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలను పాటించడం తప్పనిసరి. యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ సంస్థలకు ధృవీకరణ, నవీన సాంకేతికత, బలమైన కొనుగోలుదారుల సంబంధాలు కావాలి. ఆటోమొబైల్ ఎగుమతిదారులు వస్తూత్పత్తి ప్రదేశాన్ని నిర్ధారించే నిబంధనలను పాటించాలి.

# ఈ ప్రశ్నకు బదులుందా?



గోచీ గుడ్డ లేని మీ తాత .. దేశ విభజన ఎదుర్కొన్నాడు, చైనా వార్ ఎదుర్కొన్నాడు, బుడ్డి దీపాలతో పిల్లల జీవితాలలో వెలుగులు కోసం పరితపించాడు, , స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లంటూ ఆధునిక దేవాలయాలను నిర్మించాడు, కరువు నేలల్లో బాక్రానంగల్, హీరాకుడ్, నాగార్జునా సాగర్ లాంటి జలాశయాలులు, భిలాయ్, రూర్కెలా లాంటి పారిశ్రామిక వాడలతో, లాంటి ప్రభుత్వరంగ సంస్థలతో నిరుద్యోగాన్ని ఎదిరించాడు, ఆకలిని జయించాడు. మనువాదానికి కాలం చెల్లిందంటూ ఆడపిల్లల హక్కులకోసం హిందూ కోడ్‌ను అందించాడు. అసలీ దేశం నిలుస్తుందా? కులాల, మతాలు, భాషల పేరుతో ముక్కలౌతుందని వెక్కిరించిన వాళ్ళ ముందు తలెత్తుకుని నిలబడ్డాడు, కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఒక్కటే అని నిరూపించాడు...

మీ నాన్న ....

పోక్రాన్ అణు విస్పోటనాలతో అగ్రరాజ్యాలకు దీటుగా నేనున్నానని ప్రకటించారు, మిడిసి పడ్డ పాకిస్తాన్ నడ్డి విరగ్గొట్టి స్వతంత్ర బంగ్లాలో భారత త్రివర్ణ పతాకాన్ని గౌరవంగా ఎగరేసి ప్రపంచానికి మేము సైతం అంటూ సవాలు విసిరిండు, మీజిల్స్, కలరా, మలేరియా, పోలియో అంటూ ఎన్నెన్ని రోగాలు మీదపడ్డా బెదిరిపోలేదు, దేవుని మీద భారం వేసి దీపాలు వెలిగించలేదు, శవాల దిబ్బలు ఏర్పడకుండా ప్రతి ప్రాణాన్ని నిలబెట్టుకున్నాడు. ప్రపంచం ఆర్థిక మాంద్యంతో విలవిలలాడుతున్నా తనదైన శైలిలో జాతిని ముందుకు నడిపించాడు, మెటా నుండి అమెజాన్ వరకు జజూల నందిస్తూ గర్వంగా మీసం మెలిపెట్టాడు.

మరి ఇవాళ నువ్వు ...

అడుగడుగునా అలసిపోతున్నావు, రాజీపడి మూలుగుతున్నావు, ప్రపంచంలో ఏ మూల అలజడి చెలరేగినా బెంబేలెత్తిపోతున్నావు. చదువుల భారాన్ని తలచుకుంటే నీ గుండెలు జారుతున్నాయి, రోగమొస్తే చాలు అప్పుల ఊభిలో కూరుకు పోతున్నావు. కరోనాను ఎదుర్కోలేక శవాల కుప్పలతో జాగారం చేసినావు, చివరాఖరుకు ఆక్సీజన్ దొరక్క అలల్లాడిపోయినవ్, ప్రపంచం వెక్కిరిస్తుందేమోనని చావులెక్కలు దాచిపెట్టి మేకపోతు గాంభీర్యంతో బతుకుతున్నావు, తాత నిర్మించిన కార్మిక దేవాలయాలను ఒక్కొక్కటిగా అమ్ము కుంటూ, తాత ముందు చూపుతో తీర్చిదిద్దిన ఆధునిక దేవాలయాల్లో నీ ఫోటోలు పెట్టుకుంటూ భజన చేయించుకుంటున్నావు. ప్రాజెక్టులు కట్టి తాత అందించిన నీళ్ళతో నారు మల్లను తడుపుకుంటూ నాకేమిచ్చావని ఆయన్నే నిందిస్తున్నవు. చదువుల కోసం, ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తున్న పిల్లలకు తాతను, తండ్రిని వేలెత్తి చూపిస్తూ నీ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటున్నావు. దేశ విభజనలో సైతం మీ తాతకు కానరాని మత పిశాచి, పాకిస్తాన్ యుద్ధంలో సైతం మీ నాన్నకు అడ్డురాని మతోన్మాదం ఆధునిక యుగంలో నీకు మాత్రం కనిపిస్తున్నది, భయంతో బెంబేలెత్తిస్తున్నావు.

### సైంటిఫిక్ టెంపర్ నుంచి గో మూత్రం దాకా..

అజ్ఞానంలో బతికిన మీ తాత సైంటిఫిక్ టెంపర్ కోసం ఆరాటపడ్డాడు, సంధికాలంలో బ్రతికిన మీ నాన్న అక్షరాస్యత కోసం, ఆధునిక జీవనశైలి కోసం ఆరాటపడ్డాడు, ఆకాశమే హద్దుగా ముందుకు ఉరకాల్సిన నువ్వు మాత్రం మూఢ విశ్వాసాలతో, చేదు జ్ఞాపకాలతో ముందుకు నడవాలని ఆరాట పడుతున్నావు. ప్రపంచ యుద్ధాలతో చతికిలపడ్డ మీ తాత చూపిన తెగువలో పావలా వంతు కూడా వసుదైక కుటుంబంలో జీవిస్తున్న నువ్వు చూపలేకున్నావు. ఏమీ లేని కాలంలో కూడు గూడు గుడ్డ అన్నాడు మీ తాత, కారుచీకట్లు కమ్ముకున్న వేళ గరీబీ హటావో, జై జవాన్ జై కిసాన్ అంటూ పిలుపిచ్చాడు మీ నాన్న, అన్నీ కుదురుకున్న వేళ నువ్వేం చేస్తున్నావు, మతాన్ని వేలెత్తి చూపిస్తూ, మందిరాల్లోనే పరి పూర్ణతను ఆశిస్తూ, గో ఆర్ఘ్యం కోసం వెంపర్లడుతూ మన తాతల తండ్రుల పరిణతిని అపహాస్యం చేస్తున్నావు. నాడు మన తాతలు నమ్ముకున్నది ఆధునిక దేవాలయాలను నిర్మించిన నాయకుణ్ణి, మన తండ్రులు జై కొట్టింది రాజీప డకుండా ప్రపంచానికి మన సత్తా చాటిన అపర కాళీని, మరి నువ్వు నమ్ముతున్నదెవరిని అబద్దాలతో, అపవాదులతో నిన్ను నమ్మిస్తున్న మేక వన్నె పులిని కాదంటావా?

### జలాశయాలు.. అణ్వాయుధాలు...

మనతో చెప్పడానికి మీ తాతకు బాక్రానంగల్, హీరాకుడ్, నాగార్జునా సాగర్ డ్యాం లున్నాయి, ××ు, ××వీ లు ఇస్రోలు .. ఉన్నాయి, సస్యశ్యామలమైన లక్షలాది ఎకరాల భూములున్నాయి, గాయాలు మానిపోయి కలిసిపోయిన పంజాబ్, బెంగాల్ ప్రజలున్నారు, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రా జ్యాన్ని ఎదిరించిన చరిత్ర ఉన్నది, 500 ముక్కలను ఒక్కటిగా చేసి నిర్మించిన సువిశాల భారతదేశం ఉన్నది. చెప్పుకోడానికి మీ నాన్నకు చీకట్లు తొలగించుకుని వెలుగులు చిందిన లక్షలాది గ్రామాలున్నాయి, పాకిస్తాన్ వెన్ను విరిచి నిలబెట్టిన స్వతంత్ర ఢాకా ఉన్నది, జమీందారులను ఎదిరించి రాజా భరణాలు రద్దు చేసి, లక్షలాది ఎకరాలను నిరుపేదలకు పంచిన తెగింపు ఉన్నది, వెల్లివిరిసిన మతసామరస్యం ఉన్నది, టీకాలతో రోగాలను రూపుమాపిన ఘనత ఉన్నది, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన గుర్తింపు ఉన్నది, అగ్రరాజ్యాలను కాదని అణ్వాయుధాన్ని తయారుచేసిన ఖలేజా ఉన్నది.

జెన్ జీలు ముంగిట్లోకొస్తే ఏం చేస్తావు?

జెన్ జీ లమంటూ చెలరేగుతున్న రేపటి తరానికి చెప్పుకోడానికి నీ దగ్గరేమున్నది. తాతలు తండ్రులు కూడబెట్టిన ఆస్తులు అమ్ముకున్నానని చెప్పుకుంటావా? ఇస్రోకు, వీలకు రంగులు మార్చినావని చెప్పుకుంటావా? కార్పోరేట్లకు కట్టుబానిసనని కాలరెగురేస్తావా? అమెరికా ఆస్ట్రేలియాలతో కాదు, ఇంకా నేను పాకిస్తాన్ తోనే పోటీపడుతున్నానని గర్వపడతావా? స్వదేశీ నినాదం చతికిలపడింది, చైనా దిగుమతులతో దేశాన్ని ముంచేస్తున్నానని సంబరపడతావా? విశ్వాసంగా పడివుండే బంగ్లా, కుందేలు పిల్ల లాంటి నేపాల్ కూడా బౌ బౌ మంటూ బెదిరిస్తున్నాయని వాపోతావా? హత్యాచారాలను, నిరుపేదల హాహాకారాలను, ఆలయ ఆస్తుల స్వాహాకారాలను మతం పరదాల చాటున దాచిపెడుతున్నానని సిగ్గు పడతావా? నాడు ప్రధానులను సైతం బోనెక్కించిన న్యాయవ్యవస్తను నిర్వీర్యం చేస్తున్నానని కాలరెగురేస్తావా? మొన్న శ్రీలంక నిన్న నేపాల్‌ను ముంచెత్తిన జెన్ జీ లు రేపటిరోజు నీ ముంగిట్లోకి వస్తే ఏం చేస్తావు? తస్మాత్ జాగ్రత్త.

# నీళ్లడిగితే.. దుర్నీతి.. దుర్భాషలా?

మేడిగడ్డ బరాజ్ నుంచి కిందికి పోతున్న గోదావరి ప్రవాహాన్ని కన్నెపల్లి పంపులను ఆన్ చేసి ఎత్తిపోయమంటే ప్రభుత్వం మొండికి పోతున్నది. మేడిగడ్డ బరాజ్ గేట్లు మూయకుండానే అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లోకి, అక్కడి నుంచి ఎల్లంపల్లి జలాశయానికి సురక్షితంగా గోదావరి జలాలను ఎత్తిపోసే మార్గాన్ని సూచించినందుకు విశేష అనుభవమున్న, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విశ్రాంత ఇంజినీర్ల సంఘాన్ని కిరాయి సంఘం అని, సంఘం సభ్యులు బేవకూఫ్ సలహాలు ఇస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి దుర్భాషలకు దిగడం శోచనీయం. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టుల కోసం ఉద్యమం చేసి, ఉద్యోగ విరమణ తర్వాత కూడా అవిశ్రాంత సేవలు అందించిన వారిని కించపరుస్తూ మాట్లాడడం భావ్యమా? కరువు ఎదుర్కోవడానికి ప్రభుత్వం వద్ద ఏమైనా ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయా? ఉంటే ప్రజల ముందు పెట్టాలి. నీటిని ఎత్తిపోసే ప్రసక్తే లేదంటున్న ప్రభుత్వ వాదనను ప్రజలు తిరస్కరిస్తున్నారు. కన్నెపల్లి వద్ద నీటిమట్టం 95.40 మీటర్లకు దిగిపోయింది. సమ్మక్క వద్ద 30,200 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నది. మేడిగడ్డ వద్ద ప్రవాహాలు ఈ రకంగా ఉంటే, ఎగువన శ్రీరామ్‌సాగర్, సింగూరు, నిజాంసాగర్, కడెం, ఎల్లంపల్లి, మిడ్ మానేరు, లోయర్ మానేరు, కుమ్రం భీం లాంటి మీడియం ప్రాజెక్టుల వద్ద నీటి ప్రవాహాల జాడ లేదు. కుడి వైపున ఉన్న పట్టికలోని సమాచారాన్ని బట్టి రాష్ట్రంలో దిగువ గోదావరిలో మేడిగడ్డ, సమ్మక్క బరాజ్‌ల వద్ద తప్ప మరెక్కడా నీటి జాడ లేదని తెలుస్తున్నది. అక్కడ కూడా రోజురోజుకూ ప్రవాహాలు పడిపోతున్నాయన్న సంగతి అర్థమవుతూనే ఉన్నది. మేడిగడ్డ వద్ద తగ్గుదల కొనసాగితే ఇక అక్కడ నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకోలేం. ఇప్పటివరకు మేడిగడ్డ నుంచి కిందకి పోయిన నీరు సుమారు 80 టీఎంసీలు. పది రోజుల కింద కన్నెపల్లి పంపులు ఆన్ చేసి ఉంటే ఎల్లంపల్లికి 25 నుంచి 30 టీఎంసీల నీరు చేరి ఉండేది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో 20 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని, 25 శాతం లోటు వర్షపాతం ఉన్నదని వాతావరణ శాఖ పేర్కొన్నది. హనుమకొండలో 59 %, మేడ్చల్‌లో 50%, నిజామాబాద్ లో 37 %, వికారాబాద్ లో 33 % తీవ్ర లోటు నమోదు అయ్యింది. రాష్ట్రంలో జలాశయాలు, చెరువులు కూడా 80 % ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ ప్రస్తుతం బలహీనమైన రుతుపవన పరిస్థితులతో సాపేక్షంగా పొడి దశను ఎదుర్కొంటున్నది. జూలై, ఆగస్టులో సాధారణం కంటే తక్కువ నుంచి సాధారణ వర్షపాతం మాత్రమే ఉంటుందని వాతావరణశాఖ అంచనా వేస్తున్నది. కాబట్టి జలాశయాలు, చెరువుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరే పరిస్థితి ఉండదు. తెలంగాణ ఇంకా ఎల్ నినో ప్రభావంలో ఉన్నది. ఫలితంగా అస్తవ్యస్తమైన వర్షపాతం, అడపాదడప పొడి వాతావరణం, రుతుపవనాల పురోగతిలో జాప్యం కొనసాగుతున్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చే గణనీయమైన గోదావరి నీటి ప్రవాహాలు పూర్తిగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి ఎగువ రాష్ట్రాల్లో కురిసే స్థిరమైన, విస్తృతమైన వర్షపాతంపై ఆధారపడి ఉంటాయని స్పష్టంచేసింది. ఇలాంటి పరిస్థితుల్లో దిగువ గోదావరిలో ఇప్పుడున్న ప్రవాహాలను వదిలేయడం మూర్ఖత్వం అవుతుంది. ఈ నేపథ్యంలో మూడు రకాలైన పరిస్థితులను విశ్లేషిద్దాం. ఒకటి.. జూలై, ఆగస్టులో భారీ వర్షాలు కురిసి ఎగువన శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి, నిజాంసాగర్, మిడ్ మానేరు, కుమ్రం భీం లాంటి మధ్యతరహా ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరి జలాశయాలు నిండితే ఎల్ నినో కరువు, తాగునీటి, కరెంటు సంక్షోభం నుంచి రాష్ట్రం బయటపడుతుంది. రెండవది.. భారీ వరదలు రాలేదు కానీ కొద్దిపాటి వర్షం కురిసి జలాశయాల్లో కొద్దిపాటి నిల్వలు పెరిగితే రాష్ట్రానికి కొద్ది మేర తాగునీటి సమస్య తీరవచ్చు. కానీ ఎండాకాలంలో తాగునీరు, కరెంటు సంక్షోభం తప్పదు. ఇక మూడవ స్థితి.. వాతావరణ శాఖ అంచనా వేసినట్టు భారీ వర్షాలు, ఒక మోస్తరు వర్షాలు కూడా పడకపోతే జలాశయాలు, చెరువులు, కుంటలు నిండవు. అప్పుడు రాష్ట్రంలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితి నెలకొంటుంది. తాగునీటి సమస్యలు తప్పవు. హైడల్ పవర్ ఉత్పత్తి ఉండదు. థర్మల్ పవర్ ప్లాంట్లలోనూ ఉత్పత్తి కుంటుపడుతుంది.

## మందమర్రిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి: కేంద్ర మంత్రికి సాధన కమిటీ వినతి!



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి,మందమర్రి,జులై 15 :** మందమర్రి పట్టణంలో గత 25 ఏళ్లుగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రజాస్వామ్య పరిపాలన దెబ్బతింటోందని పేర్కొంటూ మందమర్రి మున్సిపల్ ఎన్నికల సాధన కమిటీ సభ్యులు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఒకటి--డెబ్బై చట్టం అమలులో ఉండటం వల్లే మందమర్రి మున్సిపల్ ఎన్నికలు ఇన్నేళ్లుగా జరగలేదని తెలిపారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పట్టణ అభివృద్ధి నిలిచిపోయిందని, ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి ఒకటి--డెబ్బై చట్టానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని, తద్వారా మందమర్రిలో త్వరితగతిన మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్య పరిపాలనను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల సాధన కమిటీ కన్వీనర్ అందుగుల శ్రీనివాస్, మిట్ట లక్ష్మణ్, మాయ రమేష్, రాయబారం వెంకన్న, గాజుల శంకర్, ఎండి మోహిత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి సీపీఐ నాయకుల పరామర్శ.. ఆర్థిక సహాయం అందజేత!



**బెల్లంపల్లి ప్రతినిధి జులై 15 :** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం నీలాయపల్లి గ్రామానికి చెందిన సీపీఐ గ్రామ కార్యదర్శి ఎడ్ల గోపాల్ కోడలు ఎడ్ల దేవి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో సీపీఐ నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సీపీఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ నీలాయపల్లిలోని మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొండు బానేష్ మృతురాలి కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎడ్ల దేవి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి నరాల ప్రహ్లాద్, చంద్రపల్లి గ్రామ కార్యదర్శి కొండ సాయికుమార్, నీలాయపల్లి గ్రామ సహాయ కార్యదర్శి బొంతల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## చంద్రవెల్లిలో రూ.5 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

### ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనుల ప్రారంభం




**బెల్లంపల్లి ప్రతినిధి । జులై 15** : బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్ సూచనలతో చంద్రవెల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. అతికం నర్సింహులు ఇంటి నుంచి విరగోని వసంత్ గౌడ్ ఇంటి వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ చిలుముల శ్రీనివాస్, ఉపసర్పంచ్ గజెల్లి రాజ్‌కుమార్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ నాతరి స్వామి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాసకొండ రజిత, జాడి అన్నపూర్ణ, అవునూరి భాగ్య, పోలవేణి రాజన్న, రంగ నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ కంపెల చంద్రశేఖర్, నాయకులు దాసరి దామోదర్ గౌడ్, కళ్యాణం శంకర్, పూదరి గణేశ్, రాసకొండ కార్తీక్, దాసరి రాజా గౌడ్, మామిడి మల్లేశ్, అతికం నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్‌లో వసతుల లేమి ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్న 17 మంది గురుకుల విద్యార్థులు

### సమస్యలు పరిష్కరించాలని మాజీ డీసీసీ అధ్యక్షురాలు సురేఖకు వినతి



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి । జులై 15 :** చెన్నూర్ నియోజకవర్గంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో వసతుల సమస్యలపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. హాస్టల్‌లో కనీస వసతులు సరిగా లేవని ఆరోపిస్తూ 17 మంది విద్యార్థులు అర్ధరాత్రి హాస్టల్‌ను విడిచి మంచిర్యాలలోని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసానికి చేరుకున్నారు. అయితే ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు మాజీ డీసీసీ అధ్యక్షురాలు సురేఖను కలిసి తమ సమస్యలను వివరించారు. హాస్టల్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్లి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల నుంచి సమస్యలను తెలుసుకున్న సురేఖ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించినట్లు సమాచారం. హాస్టల్‌లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, భోజనం, తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## ప్రభుత్వ బడిలోనే చదివించాలి

### అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం
### ప్రభుత్వ పాఠశాలకు బీరువా బహుకరణ
### గొడుకండ్ల ప్రవీ ణ్, కట్టెల చంద్రకాంత్




**యాచారం** మండల పరిధిలో మొండి గౌరెల్లి గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల లో కట్టెల చంద్రకాంత్, ప్రవీణ్ ఉపాధ్యాయ బృందానికి బీరువా ప్రధానం చేశారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుపై ఉపాధ్యాయులతో చర్చించారు. స్కూల్ అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. విద్యలో విద్యార్థులు రాణించాలని వారు సూచించారు. మౌలిక వసతులపై పరిశీలించారు. పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వాన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం చాంద్ సుల్తాన, కళమ్మ, శ్రీలత, మంజుల, లలిత ,ప్రశాంత్ కుమార్, తాంద్ర కుమార్, బడే ప్రవీణ్, బొరిగ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ నగర అభివృద్ధికి రేవంత్ సర్కార్ భారీ ఊతం హనుమకొండ డీసీసీలో మిన్నంటిన కాంగ్రెస్ సంబరాలు



**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో జూలై 15 :** "అభివృద్ధి అంటే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి" అని నిరూపిస్తూ, వరంగల్ నగర సమగ్ర వికాసానికి ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంది. నగర ప్రగతికి సంబంధించి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిననేపథ్యం లో, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయం వేదికగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించాయి. నగర అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు ఘనంగా క్షీరాభిషేకం చేశారు. డీసీసీకార్యాలయం ప్రాంగణంలో బాణసంచా కాల్చి, ఒకరికొకరు మిఠాయిలుతినిపించుకుంటూ సంబరాల్లో మునిగి పోయారు. వరంగల్ నగర రూపురేఖలను మార్చడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉందనడానికి ఈ నిర్ణయమే నిదర్శనమని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ముఖ్య అతిథుల సమక్షం లో ఘనంగా వేడుకలు ఈ విజయోత్సవ వేడుకల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ప్రముఖ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు భాగస్వామ్యమయ్యారు: శ్రీమతి కడియం కావ్య వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు (ఎంపీ) శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) శ్రీ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హనుమకొండ డీసీసీ అధ్యక్షులు,శ్రీ అజీజ్ ఖాన్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్,ఈ కార్యక్రమానికి పలువురు టీపీసీసీ, డీసీసీ రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు హాజరై, రేవంత్ రెడ్డి నాయకత్వానికి మద్దతుగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

## భద్రకాళి ఆలయంలో వైభవంగా ప్రారంభమైన శాఖాంబరి ఉత్సవాలు జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరోజూలై 15:** ఐతిహాసిక హనుమకొండ నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయంలో శాఖాంబరి ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగాప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ నియోజకవర్గశాసనసభ్యులు (ఎమ్మెల్యే) శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి తనసతీమణి నీలిమ రెడ్డితో కలిసి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, అధికారికంగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈఉత్సవాల ను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు, పాలకమండలి సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేదమంత్రోచ్చారణల మధ్య అర్చకులు వారికి ఆలయ మర్యాదలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీ మహాగణపతి, శ్రీఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే దంపతులు, ఆ తర్వాత శ్రీ భద్రకాళి అమ్మవారిమూలవిరాట్టును దర్శించుకున్నారు.అమ్మ వారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించిన అనంతరం ఉత్సవాల వేదిక వద్ద అధికారిక జ్యోతి ప్రజ్వలన చేశారు.

**అమ్మవారి కృపతో కరువు తీరాలి: ఎమ్మెల్యే నాయిని**

ఉత్సవాల ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా అత్యంత పవిత్రంగా సాగుతున్న ఈ సంప్రదాయ ఉత్సవాలను ఈ ఏడాది తన చేతుల మీదుగా ప్రారంభించే భాగ్యం కలగడంపూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు. "ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా, ఆ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలుకురవాల ని, కరువు కాటకాలు తొలగిపోవాలనిఅమ్మవారిని ప్రార్థించాను. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో విలసిల్లాలని, అమ్మవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నాను." శ్రీనాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని, ఉత్సవాల విజయవంతానికిభక్తులందరూ ఆలయ నిర్వాహకులకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు**

ఈ ఆధ్యాత్మిక మహోత్సవం లో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీమతి సునీత, ఆలయ ప్రధాన అర్చకులు శేషు, ప్రముఖ స్థానిక నాయకులు ఆంజనేయులు, పూర్ణ, సతీష్, వీరన్నలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శాఖాంబరి ఉత్సవాల ప్రారంభంతో భద్రకాళి ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతున్నాయి.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం.

### అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు అందిస్తాం.
### ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను మీడియా ప్రచారం చేయాలి.
### సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.
### అక్రిడేషన్లు జారీ చేసే బాధ్యత కలెక్టర్లది, డిపిఆర్ఓ లది మాత్రమే.
### సమాచార శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి



హైదరాబాద్, : రాష్ట్రవ్యాప్తంగా నెలకొని ఉన్న జర్నలిస్టుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సెక్రటేరియట్ లోని మంత్రి చాంబర్లో జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యలపై కలిసి వారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇవ్వాలని ప్రభుత్వపరంగా కలెక్టర్లకు, డిపిఆర్ ఓ లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం పలు ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ మీడియాలలో వర్కింగ్ జర్నలిస్టుగా పనిచేస్తున్నటువంటి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వం ప్రకటించిన విధంగా వెటర్నర్స్, ఫ్రీ లాన్స్ జర్నలిస్టులకు నిబంధనల మేరకు అక్రిడేషన్లు జారీ చేయాలని గతంలోనే ప్రభుత్వం పేర్కొనడం జరిగింది. కానీ కొన్ని జిల్లాలలో కలెక్టర్లు, డిపిఆర్వోలు నిబంధనలను అమలు చేయకుండా అక్రిడేషన్లు జారీ చేయడం లేదని జర్నలిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ తమ దృష్టికి తీసుకు వచ్చిందని తెలిపారు. సత్వరమే అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకే కాకుండా వెటర్నర్స్, ఫ్రీ లాన్స్ జర్నలిస్టులకు నిబంధనల మేరకు అక్రిడేషన్లు జారీ చేయవలసిందిగా సమాచార శాఖ మంత్రి, కమిషనర్ కలెక్టర్లకు, డిపిఆర్ఓ లకు ఆదేశాలు ఇస్తున్నామని జర్నలిస్టు సంక్షేమ సంఘానికి హామీ ఇచ్చారు. మంత్రి, కమిషనర్ల ఆదేశాల మేరకు అక్రిడేషన్లు జారీ చేయని యెడల రాష్ట్రవ్యాప్తంగా అక్రిడేషన్ల సాధనకై ఉద్యమం చేపడతామని జెఎస్ఎస్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. కార్యక్రమంలో జర్నలిస్టు సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు చీకట్ల శ్రీనివాస్, జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, డాక్టర్ కానుగంటి రాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బాలేశం, వైస్ ప్రెసిడెంట్ రావుల విశ్వప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొని వినతి పత్రాలను అందించారు.

## కోల్ మైన్స్ పెన్షన్‌ను 50 శాతం పెంచాలి

### కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం వినతిపత్రం!



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి । జులై 15 :** సింగరేణి విశ్రాంత ఉద్యోగులు, కోల్ ఇండియా పరిధిలోని బొగ్గు గని పెన్షన్‌దారులకు కరువు భత్యం (డీఏ)తో కూడిన 50 శాతం కోల్ మైన్స్ పెన్షన్ పెంపు కల్పించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్ రెడ్డిని కోరింది. సింగరేణి పర్యటనలో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎంఎన్ఆర్ గార్డెన్‌లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రికి సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, సింగరేణి బొగ్గు గనుల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించిన 80 వేలకుపైగా విశ్రాంత ఉద్యోగులతో పాటు దేశవ్యాప్తంగా కోల్ ఇండియా పరిధిలోని బొగ్గు పెన్షన్‌దారుల పెన్షన్ గత 25 సంవత్సరాలుగా పెంపుదలకు నోచుకోలేదని పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని కరువు భత్యంతో కూడిన 50 శాతం పెన్షన్ పెంపు అమలు చేయాలని కోరారు. అలాగే ప్రస్తుతం రూ.300 నుంచి రూ.1,000లోపు పెన్షన్ పొందుతున్న వారికి కనీస పెన్షన్‌ను నెలకు రూ.15 వేలుగా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఆర్ఎంఎస్, వైద్య పథకం కింద ప్రస్తుతం ఉన్న రూ.8 లక్షల పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, 2016 నుంచి అమలులోకి వచ్చిన రూ.20 లక్షల గ్రాట్యుటీని చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సింగరేణిలో మారు పేర్ల సవరణ ప్రక్రియను వేగవంతం చేయడం, సింగరేణి స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు మంజూరు చేయడం, 12వ వేతన ఒప్పంద కమిటీని వెంటనే ఏర్పాటు చేయడం, తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్ తరహాలో సర్వే పూర్తయిన శ్రావణ్‌పల్లి ఆర్‌కే--6 బొగ్గు బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను శ్రద్ధగా విన్న అనంతరం వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి హోదాలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఎ. గంగయ్య, నాయకులు ఎం. అంజయ్య, పోతురాజుల చంద్రయ్య, ఎన్నం శంకర్, ఇరుకుల్లా జనార్దన్, డి. పోచయ్య, ఎల్. లక్ష్మయ్య, టి. జనార్దన్ స్వామి, చుంచు గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, 14 మందికి భారీ జరిమానా: హన్మకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. ప్రవీణ్ కుమార్

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరోజూలై 15:** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి లో నిఘా తీవ్రమైంది. గౌరవ వరంగల్ పోలీస్ కమీషనర్ శ్రీమతి ఎన్. శ్వేతా రెడ్డి గారి పర్యవేక్షణలో హన్మకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 15 మంది వాహనదారులను బుధ వారం గౌరవ మేజిస్ట్రేట్ శ్రీ కె. రాజశేఖర్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు.ఈ కేసుల ను విచారించిన న్యాయ మూర్తి, నిందితుల్లో ఒకరికి జైలు శిక్ష విధించగా, మిగిలి న వారికి భారీ జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. వ్యవసాయదారుడికి రెండు రోజుల జైలు శిక్ష డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిలో నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి ఒకరికి కోర్టు జైలు శిక్ష ఖరారు చేసింది: శిక్ష పడిన వ్యక్తి: ఏడవెల్లి భాగవాన్ రెడ్డి (61)తండ్రి పేరు: రాజి రెడ్డి వృత్తి/నివాసం: వ్యవసాయం, పెంచికల పేట, హుజురాబాద్. గౌరవ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు భాగవాన్ రెడ్డికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించగా, పోలీస్ సిబ్బంది అతనిని తక్షణమే హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. కాగా, డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన మిగతా 14 మంది వ్యక్తుల కు కోర్టు మొత్తం రూ. 21,500/- జరిమానా విధించింది. లైసెన్స్ లేని వాహనదారులకూ జరిమానా మరో కేసులో భాగంగా, సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రహదారు లపై వాహనాలునడుపుతూ పట్టుబడిన ఆరుగురు (06) వ్యక్తులను సైతం ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. వారిపై విచారణ జరిపిన న్యాయస్థానం మొత్తం రూ. 2,400/- జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.పోలీస్ హెచ్చరిక: మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమప్రాణాల తో పాటు రహదారిపై వెళ్లే ఇతర అమాయకుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హన్మకొండ ట్రాఫిక్ పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీ కె. ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరంకొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు జైలు శిక్షలు కూడా తప్పవని ఆయన వాహనదారులను హెచ్చరించారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815